# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-09-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **విశాఖపట్నం - దుర్గ్ వందే భారత్ రైలును ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు దృశ్య మాధ్యమం ద్వారా ప్రారంభింస్తారు.**
2. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు గుజరాత్‌లోని గాంధీనగర్‌లో పర్యటిస్తారు.**
3. **ఆంధ్రప్రదేశ్‌లో రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**
4. **తెలంగాణలో అధికారంలోకి వచ్చిన 6 నెలల్లో 2లక్షల రూపాయల వరకు రైతు రుణమాఫీ చేశామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు.**
5. **ఈరోజు ఈద్ మిలాద్-ఉన్-నబీ పండుగను జరుపుకుంటున్నాం.**

==========================

విశాఖపట్నం - దుర్గ్ వందే భారత్ రైలు ఈ రోజు ప్రారంభం కానున్నది. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృశ్య మాధ్యమ విదానం ద్వారా ఈ రైలును ప్రారంభిస్తారు. ఈ రైలు విశాఖపట్నం- ఛత్తీస్‌ఘడ్ లోని దుర్గ్ మద్య ప్రయాణించనున్నది. దీంతో విశాఖపట్నం నుండి అనుసంధానమైన వందేభరత్ రైళ్ల సంఖ్య నాలుగుకు చేరుతుంది.

-------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు గుజరాత్‌లోని గాంధీనగర్‌లో పర్యటిస్తారు. పర్యటనలో భాగంగా గాంధీనగర్ లో జరిగే పునరుత్పాదక ఇంధన పెట్టుబడిదారుల సమావేశం 2024లో పాల్గొంటారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో పెట్టుబడుల కోసం జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులతో చర్చిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడి అవకాశాలు, మానవ వనరుల గురించి వివరించి, పరిశ్రమల ప్రతినిధులను ఆహ్వానించనున్నారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లో రహదారుల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి నిర్మాణ పనులు చేపడుతున్నట్లు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో నూతనంగా నిర్మించనున్న రహదారి నిర్మాణ పనులకు మంత్రి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన

మాట్లాడుతూ, రాష్ట్రంలోని రహదారుల అభివృద్ధికి సమీకృత ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం- పీపీపీ విధానంలో రాష్ట్రంలో రహదారుల నిర్మాణ పనులు చేపడుతున్నామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణలో అధికారంలోకి వచ్చిన 6 నెలల్లో 2లక్షల రూపాయల వరకు రైతు రుణమాఫీ చేశామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన మహేశ్‌కుమార్ గౌడ్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందలు తెలిపారు. ఈ సందర్భంగా నిన్న హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ, ఆర్టీసీలో ఇప్పటివరకు 85 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణాలు చేశారని చెప్పారు. 5 వందల రూపాయలకే గ్యాస్ సిలిండర్ ను అందిస్తున్నామని వెల్లడించారు. ఇప్పటికే 30వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చామన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని 10లక్షల రూపాయలకు పెంచామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---------------------------

భారీ వర్షాలు కారణంగా ఆలస్యమైన ఆంధ్రప్రదేశ్ రాజధానిలో ముళ్లకంప, పిచ్చి మొక్కలు తొలగింపు పనులను రేపటి నుంచి చేపడతామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. అమరావతి రాజధాని ప్రాంతంలో నిన్న సాయంత్రం మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఎర్రబాలెంలో భూసమీకరణలో భాగంగా రైతుల నుంచి అంగీకార పత్రాలు తీసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ల్యాండ్‌పూలింగ్ కింద భూములిచ్చే వారికి రాజధానిలో కోరుకున్న చోట స్థలాలను కేటాయిస్తామని చెప్పారు. రాజధానికి భూములు ఇచ్చే రైతులు ప్రభుత్వాన్ని సంప్రదిస్తే ఇళ్లకే వెళ్లి భూములు తీసుకుంటామని తెలుపుతూ,

వాయిస్ (34 సెకన్లు)

---------------------------

మహమ్మద్ ప్రవక్త జన్మదినమైన ఈద్ మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని ఈరోజు జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ గవర్నర్ బిష్ణు దేవ్ వర్మ, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఈద్ మిలాద్-ఉన్-నబీ శుభాకాంక్షలు తెలియజేశారు. మహమ్మద్ ప్రవక్త జీవితం ప్రేమ, సౌభ్రాతృత్వం ధర్మంతో కూడినదని, మానవాళికి ఎంతో స్ఫూర్తిదాయకమైనదని అన్నారు. తోటి వారికి విశ్వాసం, నమ్మకం, శ్రద్ధ, కరుణతో సేవ చేసినప్పుడు, మహమ్మద్ ప్రవక్త లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు. మహమ్మద్ ప్రవక్త దయ, కరుణ, బోధనలను ఈరోజు మనకు గుర్తు చేస్తుందని.. అందరిలో శాంతి, సద్భావనలను కలిగించాలని కోరుకుంటున్నట్లు వారు పేర్కొన్నారు.

---------------------------

వర్షాలకు నష్టపోయిన రైతులను తెలంగాణ ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లాలోని నడిగూడెం మండలం కాగిత రామచంద్రపురంలో నాగార్జున సాగర్ ఎడమ కాలువ తెగిపోయిన ప్రాంతాన్ని మంత్రి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ, భారీ వర్షాలకు తెలంగాణ వ్యాప్తంగా 10 వేల 3 వందల కోట్ల రూపాయల మేర ఆస్తి నష్టం జరిగిందని, ఇళ్లు కూలిపోయిన బాధితులకు ఇందిరమ్మ పథకంలో భాగంగా నూతనంగా ఇళ్లు నిర్మించి ఇస్తామని

చెప్పారు. వరదల్లో మృతి చెందిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం 5 లక్షల రూపాయల నష్టపరిహారం చెలిస్తోందని తెలిపారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ పునర్నిర్మాణానికి 2.10 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

---------------------------

బుడమేరు వరద వస్తుందంటూ జరుగుతున్న వదంతులను నమ్మవద్దని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ కోరారు. విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి పర్యటించి. కండ్రికలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం ఇళ్లలోకి వెళ్లి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ, విజయవాడలో వరద పరిస్థితి మెరుగుపడిందని అగ్నిమాపక యంత్రాలతో ఇళ్లను శుభ్రం చేయిస్తున్నామన్నారు. మళ్లీ వరద అంటూ ప్రచారం చేసేవారిపై ఫిర్యాదు చేశామని తెలిపారు. అసత్య ప్రచారాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి హెచ్చరించారు.

---------------------------

హైదరాబాద్‌లో గణేశ్ నిమజ్జనం దృష్ట్యా మెట్రోరైలు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. రేపు అర్ధరాత్రి 2 గంటల వరకు మెట్రో రైళ్లు నడుస్తాయని హైదరాబాద్ మెట్రోరైల్ సంస్థ వెల్లడించింది. చివరి స్టేషన్ నుంచి రాత్రి ఒంటిగంటకు చివరి రైలు బయలుదేరుతుందని పేర్కొంది. నిమజ్జనం ముగిసే వరకు అవసరాన్ని బట్టి అదనపు రైళ్లు నడుపుతామని అధికారులు తెలిపారు.

---------------------------

సుప్రసిద్ధ కర్ణాటక సంగీత విద్వాంసురాలు, అపరగాన ఎంఎస్ సుబ్బులక్ష్మి జయంతి ఈరోజు. భారతదేశ అత్యున్నత పౌరపురస్కారమైన భారతరత్నను పొందిన మొట్టమొదటి సంగీత కళాకారిణి, ఆసియా నోబెల్ ప్రైజ్‌గా పరిగణించే రామన్ మెగసెసే పురస్కారం పొందిన తొలి భారతీయ సంగీత కళాకారిణి అయిన ఆమె తమిళనాడు రాష్ట్రంలోని మదురైలో 1916 సెప్టెంబర్ 16న జన్మించారు. 1926లో 10 సంవత్సరాల వయసులో దేవాలయంలో పాటలు పాడడంతో తొలి సంగీత ప్రదర్శనను ప్రారంభించిన సుబ్బులక్ష్మి నాటి నుండి సంగీత ప్రియులను తన మధుర స్వరంతో మైమరపించారు. యం.యస్. సుబ్బులక్ష్మి జయంతి సందర్భంగా ఆమె గళం నుండి జాలువారిన ఒక గీతంలోని పల్లవి శ్రోతల కోసం....

...వాయిస్.... 23 సెకన్లు...

---------------------------

ఈ రోజు అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం నిర్వహిస్తున్నారు, సూర్యుని నుండి వెలువడే అతి నీల లోహిత కిరణాలు భూమిని నేరుగా తాకితే... సమస్త జీవరాశి మనుగడకే పెనుముప్పు వాటిల్లుతుంది. అంత ప్రమాదం జరగకుండా... సూర్యుని అతినీల లోహిత కిరణాలు మనపై నేరుగా ప్రసరించకుండా సూర్యునికి, మనకి మధ్యలో వున్న ఓజోన్ పొర మనలను కాపాడుతోంది. ప్రస్తుతం... ఈ ఓజోన్ పొర క్షీణిస్తోందని పర్యావరణ వేత్తలు గుర్తించారు. ఈ ఓజోన్ పొరను పరిరక్షించే ఉద్దేశ్యంతో 1987 సెప్టెంబర్ 16న ప్రపంచ దేశాల మధ్య మాంట్రియల్లో ఒక ఒప్పందం కుదిరింది. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా సెప్టెంబర్ 16ను ఓజోన్ పరిరక్షణ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో 47 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిరీక్షణలో ఉన్న 20 మందికి పోస్టింగులు ఇవ్వగా, 20 సబ్‌డివిజన్లకు కొత్త సబ్ డివిజనల్ పోలీసు అధికారులను నియమించింది. అదేవిధంగా ఐదుగురు అధికారులకు విజయవాడ, విశాఖపట్నం నగర కమిషనరేట్ల పరిధిలో ఏసీపీలుగా పోస్టింగులు ఇచ్చింది. అలాగే ఎస్‌డీపీవోలుగా ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న వారిలో ఏడుగురిని బదిలీ చేసింది. పోస్టింగ్‌లు ఇవ్వని వారిని పోలీసు ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. పోలీసు ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు.

----------------------------

విశాఖ పట్నం సముద్ర తీరంలో చేపలవేట కొనసాగిస్తున్న పడవలో మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటన లో పడవలో ప్రయాణిస్తున్న ఐదుగురు మత్స్యకారులు సురక్షితంగా ఉన్నారని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ జి.విజయ తెలిపారు. ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో బోటు పూర్తిగా దగ్ధమైందని మత్స్యకారులు సముద్రంలో దూకి సమీపంలో ఉన్ననౌకాశ్రయానికి చేరుకున్నారని తెలిపారు. ప్రమాదంపై విచారణ జరుపుతున్నామని ఆమె చెప్పారు.

======================